## క్లుప్తంగా

### ఉల్లి రైతులను ఆదుకోవాలి

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉల్లి రైతులను ఆదుకునేందుకు క్వింటాలు రూ.3 వేలుతో ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు పోతిరెడ్డి భాస్కర్, బాల చంద్రయ్య, మోహన్ పాల్గొన్నారు.

### వక్తృత్వ పోటీలు

**కడప సెవెన్‌రోడ్స్ :** ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి షేక్ అయేషా, ద్వితీయ బహుమతి షేక్ ఆక్సా, తృతీయ బహుమతి ఎస్.రషీద, టి.అఫిన్‌లు దక్కించుకున్నారు. అలాగే కన్సోలేషన్ బహుమతులు ఎస్.ఫాతిమా, బి.కీర్తిప్రియ, పి.మౌనిక, కె.వైష్ణవిదేవి, పి.సుస్మిత, ఎస్.శ్రీలత, బి.భావన పొందారు. వీరికి గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న నరసింహారెడ్డి వర్ధంతి సభలో మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు ఇంటాక్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి తెలిపారు.

### వైద్యశిబిరం



వైవీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం

**వైవీయూ :** యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయసేవాపథకం యూనిట్-9 ఆధ్వర్యంలో శివాజీనగర్‌లో నిర్వహించిన వైద్యశిబిరానికి చక్కటి స్పందన లభించింది. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చక్కగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎన్.వెంకట్రామిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డా.కె.శ్రీనివాసరావు, వైద్యులు డా. రవితేజ, సహాయకులు రెడ్డిబాషా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

### బీజేపీ ప్రజాపోరు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణరెడ్డి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** భారతీయ జనతా పార్టీ ప్రజాపోరు కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం ఆ పార్టీ నాయకులు కడపలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి, ప్రజా పోరు కడప జిల్లా కన్వీనర్ సింగారెడ్డి రామచంద్రారెడ్డిలు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, అల్లపురెడ్డి హరినాథరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జింగిటి సుబ్బారెడ్డి, చేపూరి శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**వల్లూరు :** మండల పరిధిలోని తప్పెట్ల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం మండలంలోని కోగటం గ్రామానికి చెందిన జిలానీ బాషా గాయపడ్డాడు. జిలానీ బాషా కడప నుండి స్వగ్రామానికి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం, కడప వైపు నుంచి ఎర్రగుంట్ల వైపుకు వెళుతున్న లారీ తప్పెట్ల వద్ద ఢీకొన్నాయి. స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం అతన్ని ఆసుపత్రికి తరలించారు.

# మాతృభాష ప్రాముఖ్యతను పిల్లలకు తెలియజేయాలి



కడప ఎడ్యుకేషన్: షాజియా బేగంను సన్మానిస్తున్న రూట నాయకులు



కడప కల్చరల్ : తవ్వా వెంకటయ్యను సత్కరిస్తున్న దృశ్యం



వైవీయూ : మాట్లాడుతున్న ఆచార్యులు జి.పార్వతి

**కడప ఎడ్యుకేషన్:** బాల్యం నుంచే తమ పిల్లలకు తల్లిదండ్రులు మాతృభాష ప్రాముఖ్యతను తెలియచేయాలని కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని ఉర్దూ డిపార్టుమెంట్ అధ్యక్షురాలు డాక్టర్ షాజియా బేగం గత దశాబ్దకాలంగా తన సొంత నిధులతో మాతృభాష ఉర్దూ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి ఆమె సేవలకు గుర్తుగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రూట లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసీవుల్లా బర్తిమారి సాహెబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూను మరింత అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రూట రాష్ట్ర సమన్వయకర్త మహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర అకడమిక్ వింగ్ కన్వీనర్ షాబుద్దీన్, హిందీ పండితులు ఎఫ్ఎం కరీముల్లా, కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

**తెలుగు ప్రాముఖ్యతను తెలుసుకోవాలి**

**కడప ఎడ్యుకేషన్ :** తెలుగుభాష ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కేఎల్ఎం ప్రిన్సిపాల్ రత్నమ్మ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం కేఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుభాషను ఎవరు కూడా మరువకూడదన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆంగ్ల భాష అవసరమే అయినప్పటికీ తెలుగుభాషను కూడా అదే స్థాయిలో నేర్చుకోవాలన్నారు.

**అధికార భాషా సంఘం కృషి ప్రశంసనీయం**

**కడప కల్చరల్ :** ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో అధికారభాషా సంఘం చైర్మన్ విజయ్ బాబు మార్గదర్శనంలో అన్ని జిల్లాల కార్యాలయాల్లో తెలుగు అమలుకు సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారని తెలిపారు. తాను సైతం పలు ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించి వ్యవహారాలన్నీ తెలుగులోనే జరిగేలా చూడాలని అధికారులకు సూచించామన్నారు. వైవీయూ పాలక మండలి సభ్యులు, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వెంకటయ్య తెలుగు అమలుకోసం కృషి చేస్తున్నారన్నారు. రాయలసీమ టూరిజం సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ తెలుగుభాష గొప్పదనాన్ని తెలిపే తొలి, మలి తెలుగు శాసనాలు మన జిల్లాలో లభించడం ఆ భాషకు మన జిల్లా పట్టం కట్టినట్లు తెలుస్తోందన్నారు. ఈ సందర్భంగా అధికారభాషా సంఘం సభ్యుడిగా పదవి స్వీకరించి సంవత్సరం పూర్తయిన క్రమంలో డాక్టర్ తవ్వా వెంకటయ్యను సత్కరించారు.

**అమ్మ భాషతోనే జాతికి మనుగడ**

అమ్మభాషతోనే జాతికి మనుగడ ఉంటుందని తెలుగుభాషా వికాస సమితి జిల్లా అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతురావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తొలుత తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 భాషలు నేర్చుకున్న మహాకవి సరస్వతిపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు సైతం మాతృభాషకు తొలి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తెలుగు భాషాభిమానులు సుబ్బరాయుడు, శ్రీరామమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో రాయుడు, హుసేన్, అబ్దుల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**మాతృభాషలోనే జ్ఞానాభివృద్ధి**

**వైవీయూ :** మాతృభాషలోనే జ్ఞానాభివృద్ధి అధికంగా ఉంటుందని గ్రహణ శక్తికి, సృజన శీలతకు మాతృభాష ఆలంబనగా నిలుస్తుందని తెలుగు శాఖ ఆచార్యులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగుశాఖ ఆచార్యులు జి.పార్వతి, ఆచార్య ఎన్. ఈశ్వర్‌రెడ్డి, ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ భాషా నైపుణ్యాలు మాతృభాషలో పెంపొందినంతగా ఇతర భాషల్లో పెంపొందించలేమని అన్నారు. విద్యార్థులందరూ మాతృభాషలోని యాసను నుడికారాన్ని గుర్తించి భాష ఔన్నత్యాన్ని వినియోగించుకోవాలని వివరించారు. ఆచార్య పి రమాదేవి, ఆచార్య ఎం ఎం వినోదిని తదితరులు పాల్గొని మాతృభాషా ఔన్నత్యాన్ని విద్యార్థులతో పంచుకున్నారు.

### ప్రారంభమైన వార్షికోత్సవ ఉత్సవాలు

**పెండ్లిమర్రి :** మండలంలోని వెల్లటూరు గ్రామ సమీపంలోని కాటారెడ్డి కాలువ వద్ద వెలసిన శ్రీకాశిరెడ్డినాయన, లక్ష్మీనరసింహస్వామి 20వ వార్షికోత్సవ ఉత్సవాలు బుధవారం ప్రారంభమైయ్యాయి. ఉదయం అర్చకుల ఆధ్వర్యంలో హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

**నేడు బండలాగుడు పోటీలు :** కాశిరెడ్డి నాయన వార్షికోత్సవ ఉత్సవాల సందర్భంగా గురువారం ఉదయం సేద్యం ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు.

### నేడు ఎమ్మెల్యే రాక

**చెన్నూరు :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం వలంటీర్లకు వందనం, అలాగే గోపవరం దగ్గర నూతనంగా నిర్మించిన మాతంగి శ్యామలదేవి ఆలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులు రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్ సీపీ ప్రతినిధులు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు, పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

**వీరపునాయునిపల్లె :** స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, సర్పంచులు పాల్గొనాలని కోరారు.

## ఎన్నికలు పేపర్ బ్యాలెట్ ద్వారా నిర్వహించాలి



సమావేశంలో అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న వక్త

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** రాబోయే సార్వత్రిక ఎన్నికలను ఈవీఎం యంత్రాలపై కాకుండా పేపర్ బ్యాలెట్ వినియోగించి నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారు. కడప నగరం రవీంద్ర నగర్‌లో గల సౌత్ ఇండియా మసాయిద్ యాక్షన్ బోర్డు కమిటీ కార్యాలయంలో సౌత్ ఇండియన్ మసాయిద్ యాక్షన్ బోర్డు కన్వీనర్ జహీరుద్దీన్ హుస్సేన్, వైస్ కన్వీనర్ సలావుద్దీన్‌ల ఆధ్వర్యంలో పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలో ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల పనితీరు సరిగా లేదన్నారు. ఈవీఎంల వల్ల దేశంలో ఒకే పార్టీకి ఫలితాలు వస్తుండడంతో ప్రజలు కూడా సందిగ్ధంలో ఉన్నారని అభిప్రాయపడ్డారు. ఈవీఎంలు వద్దు బ్యాలెట్ ముద్దు అనే కార్యక్రమం ఈనెల 23వ తేదీన రవీంద్ర నగర్ యూఎస్ మహల్‌లో జరుగుతుందని, ఈ సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొనే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నజీర్ అహ్మద్, ఫాదర్ విల్సన్, ఫాదర్ మోహన్ బాబు, సీపీఎం నాయకులు రామ మోహన్ రెడ్డి, సీపీఐ నాయకులు కేసి బాదుల్లా, హేతువాద సంఘం నాయకులు సి ఆర్ వి ప్రసాద్, జకీరుద్దీన్, తాహిరుల్లా, ఖాదర్, సిరాజ్ బుకారి, జమీత్ బుకారి, రవీంద్ర నగర్ యూత్ లీడర్ సయ్యద్ జహూర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

**కడప ఎడ్యుకేషన్ :** రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అందుకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ సూచించారు. బుధవారం కడప చెమ్మియాపేటలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌ను డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె 6,7,8 తరగతుల విద్యార్థులతో ఇంటరాక్టివ్ అయ్యి పిల్లలు ఎలా చదువుతున్నారని పరిశీలించడంతోపాటు ప్రభుత్వం సరఫరా చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌ను ఎలా వినియోగించుకుంటున్నారనే విషయాన్ని ఆరా తీశారు. దానిని ఎలా ఆపరేట్ చేయాలో పిల్లలతోనే చేయించారు. అలాగే 8వ తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్స్ ఏవిధంగా ఉపయోగపడుతున్నాయని విచారించారు. దీంతోపాటు జగనన్న విద్యాకానుక అందిరికి అందాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. దీంతోపాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో రోజుకో మెను అందించడంతోపాటు చిక్కీ, రాగి జావాను కూడా ఇస్తున్నారన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మేరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మము కరుణించరావా శ్రీవేంకటరమణ



పల్లకిలో అద్దంలో కనిపిస్తున్న మోహినీ అలంకారంలో శ్రీవారు

**పులివెందుల టౌన్ :** పులివెందులలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం 6వ రోజు స్వామి వారు ఉదయం పల్లకిలో మోహినీ ఉత్సవం నిర్వహించారు. రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అలంకారంలో స్వామివారు దివ్య మంగళ స్వరూపంతో దేదీప్యమానంగా వెలిగిపోతూ కనిపించారు. పల్లకిలో స్వామివారి ఎదుట నిలువుటద్దం ఏర్పాటు చేశారు. స్వామివారిని భక్తులు అద్దంలో చూచి తరించారు. పట్టణ పురవీధుల్లో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయంలో సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్రనామార్చన, నివేదన, నిత్యహోమం, కలశారాధన, బలిహరణం ఇత్యాది పూజలను చేసి హారతి, తీర్థప్రసాదాల వినియోగం చేపట్టారు. సాయంత్రం సహస్త్ర దీపాలంకరణ సేవలో ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు.

### 'ఫాతిమా'లో వైద్య అధ్యాపకులకు తరగతులు



శిక్షణ ఇస్తున్న డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** కడప నగరంలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో బుధవారం వైద్య అధ్యాపకులకు బేసిక్ కార్డియో లైఫ్ సపోర్టు తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఐఆర్‌సీటీ సెంటర్‌కు చెందిన డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బేసిక్ కార్డియో అండ్ పల్మనరీ లైఫ్ సపోర్టు ప్రాముఖ్యతను వివరిస్తూ రోగులను ఎలా కాపాడో వివరించారు. అకస్మాత్తుగా ఎవరికైనా గుండెపోటు వస్తే వారికి ఎలాంటి చికిత్సను అందించాలో బొమ్మల ద్వారా వివరించారు. అలాగే కాన్పుల సమయంలో అకస్మాత్తుగా తల్లికిగానీ, బిడ్డకుగానీ కార్డియాక్ అరెస్టు సంభవించినపుడు వారికి తక్షణ చర్యగా ఎటువంటి వైద్య సేవలు అందించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఏక్యూ జవ్వాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహమ్మద్ సల్మాన్ ముర్తుజాతో పాటు వైద్యులు పాల్గొన్నారు.

### ఘనంగా ముగిసిన వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

**వీరపునాయునిపల్లె :** బుసిరెడ్డిపల్లెలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ సీతారామ సమేత లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఉదయం సీతారామస్వామి విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవంలో కృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి దంపతులు ఉభయదారులుగా కూర్చున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కమలాపురం మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్



ఎం.డి షరీఫ్, కడప డీఎస్పీ

**కడప అర్బన్ :** కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో మునిసిపల్, పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి పొందిన చోట మాత్రమే వాటిని నెలకొల్పాలని తెలిపారు. విద్వేషాలు రగిల్చేలా ఫ్లెక్సీలు ఉండకూడదని ఆయన తెలిపారు. మోటార్ సైకిల్, ఆటో, కారు, ర్యాలీలకు అనుమతి లేదని, ముందస్తు అనుమతితో సాధారణ నడక ర్యాలీలకు మాత్రమే నిబంధనల మేరకు అనుమతించడం జరుగుతుందన్నారు. నిర్వాహకులు పోలీసు అధికారుల నుంచి అనుమతి పొందిన తేదీ, సమయం, రూట్‌లోనే వెళ్లాలనీ, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి కార్యక్రమాల్లో కూడా డి.జె.లకు అనుమతి లేదని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్కూళ్లు, హాస్పిటళ్లు, ప్రార్థనా స్థలాల వద్ద (సైలెన్స్ జోన్స్) ఎట్టి పరిస్థితుల్లో మైక్ లేదా లౌడ్ స్పీకర్‌ను వినియోగించకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు.

## ఒత్తిడి జయిస్తే విజయం మీ సొంతం



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి

**కడప ఎడ్యుకేషన్ :** ఇంటర్మీడియట్‌ను చదువుతున్న విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే విజయం మీ సొంతం అవుతుందని ఇంటర్మీడియట్ డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్యలు పేర్కొన్నారు. బుధవారం కడపలోని నారాయణ, శ్రీచైతన్య జూనియర్ కళాశాలల్లో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అండ్ సూసైడ్ ప్రివెన్షన్ అనే అంశంపైన జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన సీనియర్ లెక్చరర్స్‌కు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నేడు ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు ఒత్తిళ్లకు లోనై ఆత్మహత్యల వరకు పోతున్నారన్నారు. ఇలా చేస్తే వారి జీవితం నాశనమవ్వడమే కాకుండా కన్న తల్లితండ్రులకు జీవితాంతం కడుపు కోతను మిగిల్చిన వారవుతారన్నారు. జీవితంలో పోరాడి సాధించాలే తప్ప పిరికి చర్యలు తీసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని హితువు పలికారు. సంబంధిత విషయాలన్నింటిపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారిలో పాజిటివ్ తత్వాన్ని పెంపొందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఎవరైనా డిప్రెషన్‌కు లోనైనట్లు కనిపిస్తే వెంటనే వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు.

## వ్యాయామ ఉపాధ్యాయుడు వెన్నముక లాంటి వాడు



ఆర్‌జేడీ రాఘవరెడ్డిని సన్మానిస్తున్న నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులు

**కమలాపురం :** పాఠశాలల అభివృద్ధిలో వ్యాయామ ఉపాధ్యాయుని పాత్ర కీలకం అని, పాఠశాలకు ఆయన వెన్నముక లాంటి వాడని పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌లో జరిగిన నియోజకవర్గ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయుల బృందం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంత ముఖ్యమో, పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయుడు అంతే ముఖ్యమన్నారు. పాఠశాలకు పీఈటీ, పీడీలు వెన్నముక లాంటి వారన్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులను దృఢంగా తీర్చిదిద్దాలంటే అది వారికే సాధ్యమన్నారు. ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే వ్యాయామ ఉపాధ్యాయుల్లో ఉన్న ప్రతిభను ఒకరికొకరు పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రతి ఉన్నత పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని, స్కౌట్ ప్రాధాన్యతను వివరించారు.

**100శాతం ఉత్తీర్ణత సాధించాలి**

ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్‌జేడీ రాఘవరెడ్డి తెలిపారు. పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. సిలబస్, పరీక్షలు, ఫలితాలు తదితర వాటిపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే 100శాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ఉదయం 5 గంటలకే నిద్ర లేవాలని, రాత్రి 11 వరకు చదవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఓబుల్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి అరుణ కుమారి, నియోజకవర్గ కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్ సునీల్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివ శంకర్‌రెడ్డి అన్ని మండలాల పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

# రేనాటి వీరుడు.. ప్రథమ స్వాతంత్ర్య యోధుడు

నేడు కడపలో ఉయ్యాలవాడ వర్ధంతి

**కడప సెవెన్‌రోడ్స్ :** సిపాయిల తిరుగుబాటుకు పదేళ్ల ముందే నాటి కడప జిల్లా కోవెలకుంట్ల తాలూకా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన మజ్జారి నరసింహారెడ్డి తెల్లదొరల పెత్తనంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. మూడు నెలలు ఆంగ్లేయులను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాపించాడు. తిరుగుబాటుపై ఉక్కుపాదం మోపిన కంపెనీ ప్రభుత్వం ఎట్టకేలకు వలపన్ని నరసింహారెడ్డిని పట్టుకుని 1847 ఫిబ్రవరి 22వ తేదీన ఉదయం కోవెలకుంట్ల జుర్రేటి ఒడ్డున ఉరి తీశారు. తమను ఎదిరిస్తే ఎవరికైనా ఇదే గతి పడుతుందని ప్రజలను హెచ్చరిస్తూ ఆయన తలను కోట బురుజుకు వేలాడదీసి ఉంచారు. తిరుగుబాటును కాలరాచి వేశామని పాలకులు సంబరపడ్డారు. కానీ అది పదేళ్ల తర్వాత ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా రూపుదాల్చగా, వందేళ్లకు ఆంగ్లేయులు దేశం నుంచి పారిపోయేలా చేసింది.

**'సీమ' రైతాంగ పోరాటం**

కరువులు వచ్చి పంటలు పండకపోయినా భూమి శిస్తు వసూలు చేసేవారు. పైగా శిస్తుల భారం అధికంగా ఉండడంతో అనేక గ్రామాల్లో వేలాది ఎకరాల భూములను రైతులు బీళ్లుగా పెట్టాల్సి వచ్చింది. గ్రామ కట్టుబడి బంట్రోతులు అనుభవించుకుంటున్న మాన్యం భూముల వంశపారంపర్య హక్కులు ప్రభుత్వం రద్దు చేసింది. సంతతి లేకుండా మరణించిన కట్టుబడుల భూములను లాగేసుకున్నారు. గ్రామ విధులను సరిగా నిర్వర్తించలేదని కొందరి తవర్జీ తగ్గించారు. బంట్రోతులను బదిలీ చేయడం, గ్రామ పోలీసు వ్యవస్థ పునర్ నిర్మాణానికి ప్రయత్నించారు. ఇవన్నీ కట్టుబడులలో అలజడి కలిగించడంతో జనం నరసింహారెడ్డి వెంట నడిచారు. ఈ కేసు విచారించిన స్పెషల్ కమిషనర్ ఇంగ్లిస్ స్వయంగా ఈ వివరాలను బోర్డు ఆఫ్ రెవెన్యూకు నివేదించారు. ఈ కారణాల రీత్యా దీన్ని రాయలసీమ రైతాంగం జరిపిన తొలి తిరుగుబాటుగా భావించాలని చరిత్రకారులు అంటున్నారు.

**చరిత్రకారుల చిన్నచూపు**

ఆంధ్ర చరిత్రకారులు ఈ తిరుగుబాటు పట్ల చిన్నచూపు చూశారనే విమర్శలు ఉన్నాయి. పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం, చీరాల-పేరాల ఉద్యమం, రంపా తిరుగుబాటు వంటి ఉద్యమాలకు చరిత్ర పుస్తకాల్లో చోటు లభించాయి. కానీ నరసింహారెడ్డి తిరుగుబాటుకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదు. నరసింహారెడ్డి లాంటి పాలేగాళ్లు జరిపిన తిరుగుబాట్లకు దక్షిణ భారతదేశ చరిత్రలో చాలా అన్యాయం జరిగిందని ప్రసిద్ధ చరిత్ర పరిశోధకురాలు డాక్టర్ జోలెపాలెం మంగమ్మ వాపోవడంలో నిజం లేకపోలేదు. తిరుగుబాటుకు సంబంధించిన నాటి బ్రిటీషు రికార్డులు ఎన్నో ఉన్నాయి. ఊరు, పేరు లేని జానపదులు రచించిన కోలాటపు పాటలు, పిచ్చగుంట్ల వారు ఆలపించే పాటలు, ఇతర జానపద సారస్వతం తక్కువేమి లేదు. కానీ ఆధునిక చరిత్రకారులమని చెప్పుకునే వారికి ఈ తిరుగుబాటు పట్టకపోవడం పట్ల పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. బెంగాళి చరిత్రకారులు డాక్టర్ ఎస్‌బీ చౌదరి 1555లో రాసిన సివిల్ డిస్టర్బెన్సెస్ డ్యూరింగ్ ద బ్రిటీషు రూల్ ఇన్ ఇండియా (1965-1857) అనే గ్రంథంలో నరసింహారెడ్డి తిరుగుబాటుకు సముచిత స్థానం కల్పించారు. బెంగుళూరు విశ్వవిద్యాలయ ఆచార్యులు తంగిరాల వేంకట సుబ్బారావు రాసిన 'రేనాటి సూర్యచంద్రులు' అనే పరిశోధన గ్రంథం, బండి గోపాల్‌రెడ్డి రాసిన 'బ్రౌన్ జాబుల్లో స్థానిక చరిత్ర శకలాలు-కడప జాబుల సంకలనం', పాణ్యం నరసరామయ్య రాసిన 'స్వాతంత్ర్య వీరుడు' అనే పద్యకావ్యం, కల్వటాల జయరామారావు రాసిన 'రేనాటి వీరుడు' నవల వంటివి లేకపోతే ఈ తిరుగుబాటుకు సంబంధించిన వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండేవి కావు.

**నేడు వర్ధంతి సభ :** ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభను గురువారం ఉదయం 10 గంటలకు కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సభలో రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్, ఇంటాక్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి జిల్లా కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, రెడ్డి సేవా సమితి జిల్లా కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, బైరెడ్డి రామకృష్ణారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, చంద్ర, చంద్రశేఖర్, ఏపీ రెడ్డి సంఘం నాయకులు హాజరు కానున్నారు.

